

ఐడీఏ బొల్లారంలో మహాలక్ష్మి అలంకరణలో..



సదాశివపేటలో ధనలక్ష్మిగా..



ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో సౌభాగ్యలక్ష్మిగా..

మహాలక్ష్మీ నమోస్తుతే

జిల్లా వ్యాప్తంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సదాశివపేటలోని మంగళవారం కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని రూ.లక్షల నోట్లతో అలంకరించారు. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట శ్రీ భవానీ మాత ఆలయంలో సౌభాగ్యలక్ష్మిగా దర్శనమిచ్చారు. జిన్నారం మండలం ఐడీఏ బొల్లారంలో మహాలక్ష్మిగా అలంకరించి పూజలు చేశారు. - న్యూస్‌టుడే, సదాశివపేట, సంగారెడ్డి గ్రామీణ, జిన్నారం.

ఈనాడు సంగారెడ్డి

బుధవారం అక్టోబరు 9, 2024

ఈ దారిలో ప్రయాణం.. అరచేతిలో ప్రాణం..

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్



కొత్తూర్(బి) వద్ద రోడ్డుపై ప్రమాదకరంగా గుంత

బీదర్ రోడ్డులో తరచూ ప్రమాదాలు

● ఈనెల 7న న్యాల్‌కల్ మండలం గణేశ్‌పూర్ వద్ద ద్విచక్ర వాహనాన్ని కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడ్డారు.

● సెప్టెంబరు 15న మిర్జాపూర్(బి)-కొత్తూర్(బి) శివారు నారింజ ప్రాజెక్టు వద్ద ద్విచక్ర వాహనాన్ని కర్ణాటక బస్సు ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు.

ఇవి జహీరాబాద్- బీదర్ అంతర్రాష్ట్ర రహదారిపై జరిగిన ప్రమాద ఘటనల్లో కొన్ని. తెలంగాణ-కర్ణాటక సరిహద్దు మీదుగా సాగుతూ కర్ణాటకలోని బీదర్, బాల్కి, మహారాష్ట్ర జిల్లాలను అనుసంధానించే బీదర్ రహదారిపై వరుసగా జరుగుతున్న ప్రమాదాలతో రక్తమోడుతోంది.

ఆరునెలల్లో పదిహేను ఘటనలు: ప్రమాదాల పరంపర కొనసాగుతున్నా నివారణకు అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవడంలేదు. ఆరు నెలల్లో పదిహేను ప్రమాద ఘటనలు జరిగి, పది మందికి పైగా దుర్మరణం చెందారు. 22 మంది తీవ్రంగా గాయపడ్డారు. రహదారిలో భారీ గుంతలు పడ్డాయి. వాటిని తప్పించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

జాడలేని సూచికలు: జహీరాబాద్ పట్టణ శివారు పాత ఆర్టీవో చెక్‌పోస్టు నుంచి బీదర్ వరకు 32 కి.మీ. పొడవునా జహీరాబాద్- బీదర్ రహదారి సాగుతోంది. 19 కి.మీ. జహీరాబాద్, న్యాల్‌కల్ మండలాల మీదుగా తెలంగాణ పరిధి, 13 కి.మీ. బీదర్ తాలూకా కర్ణాటక పరిధిలోకి వస్తుంది. ఈ మార్గంలో ప్రధానంగా న్యాల్‌కల్ మండలం హుసెళ్లి, గణేష్‌పూర్, మెటల్‌కుంట, గంగ్వార్, మిర్జాపూర్(బి), కొత్తూర్(బి), డిడ్గి శివారుల్లోనే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. మన జిల్లా పరిధిలోకి వచ్చే 19 కి.మీ. పొడవునా ప్రమాదకర మలుపులు, గుంతలు, ఎత్తుపల్లాలున్నా ఎక్కడా సూచికలు లేవు. బీదర్ జిల్లా పరిధిలో వేగ నిరోధకాలు, ప్రమాద సూచికలు, రేడియం బోర్డులు ఏర్పాటు చేశారు.

విస్తరణకు నోచుకోక..: వికారాబాద్ జిల్లా మన్నెగూడ-తాండూరు మీదుగా జహీరాబాద్-బీదర్ రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించేందుకు సర్వే చేపడతామని ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు.

క్షేత్రస్థాయిలో సందర్శించి..: శ్రీనివాస్, డీఈఈ, జహీరాబాద్

జహీరాబాద్-బీదర్ రహదారిపై ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణయిస్తాం. ముందుగా ప్రమాద సూచికలు, రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతు చేయిస్తాం.

ఊరూరా గ్రామసభ.. ఉపాధికి ధీమా

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్:



ఉన్న ఊరిలోనే పనులు కల్పించేందుకు ప్రభుత్వం ఉపాధి పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం పేదలకు బాసటగా నిలుస్తోంది. 2025-26కు సంబంధించి చేపట్టాల్సిన పనులను గుర్తించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు కార్యాచరణ చేపట్టారు. ఇందులో భాగంగానే ఊరూరా గ్రామసభలు నిర్వహిస్తున్నారు. జల సంరక్షణ, రైతులకు ప్రయోజనం చేకూర్చే పనులను గుర్తించేలా ప్రణాళిక రూపొందించారు.

రోజుకు మూడు నుంచి నాలుగు గ్రామాలు: సాంకేతిక సహాయకులు (టీఏ)లు రోజుకు మూడు నుంచి నాలుగు గ్రామాల్లో పర్యటిస్తారు. ఆయా ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏ పనికి ఎన్ని నిధులు అవసరమవుతాయో గుర్తించి అంచనా తయారు చేస్తారు. వారి వెంట ఏపీవో, కార్యదర్శులు ఉంటారు. ఈనెలాఖరులోపు పనులు గుర్తించి గ్రామ సభలో తీర్మానం చేసి మండలానికి నివేదిక అందజేస్తారు. అక్కడ అంచనాలు పూర్తి చేసి జిల్లా కార్యాలయానికి, అక్కడి నుంచి రాష్ట్ర స్థాయి అధికారులకు డిసెంబరు 31లోపు అందజేస్తారు. రాష్ట్ర స్థాయి అధికారులు ఏప్రిల్ 1 నుంచి ఎంపిక చేసిన పనులకు పరిపాలన పరమైన అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేస్తారు. ఆ మేరకు పల్లెల్లో ఆయా పనులు చేపట్టేందుకు అవకాశం లభిస్తుంది.

జిల్లాలో లెక్కలిలా

- మండలాలు: 24
- పంచాయతీలు: 646
- జాబ్ కార్డున్న వారు: 2.19లక్షలు
- ఇప్పటి వరకు పని కల్పించిన కుటుంబాలు: 96,000
- పని చేస్తున్న కూలీలు: 1.49లక్షలు
- వంద రోజులు పూర్తయినవారు: 584
- రోజుకు కూలీలకు సగటున రూ.203.44
- కూలీలకు చెల్లించిన నగదు: రూ.90.42 కోట్లు
- సామగ్రికి ఖర్చు చేసింది: రూ.74.83 కోట్లు

జల సంరక్షణకు..

ఈ ఏడాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జలసంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. పంట కాల్వలు, నీటి, ఊట కుంటలు, ఇంకుడు గుంతలు, పొలంపొండ్, కందకాలు, పొలాల వద్దకు వెళ్లేందుకు మట్టిదారులు వేయడం, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన అయిదు ఎకరాల్లోపు భూములను చదును చేయడం, గొర్రెలు, మేకల, పశువుల షెడ్లు, వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడం, సంరక్షించడం, తెలంగాణ క్రీడా మైదానాలు శుభ్రం చేయడం, చెరువులు, కుంటలు పూడికతీత ఇలా 265 పనులు చేపట్టనున్నారు.

ప్రణాళికలు రూపొందిస్తున్నాం



పనులను గుర్తించేందుకు ఊరూరా గ్రామసభలు నిర్వహిస్తున్నాం. ప్రజల ఆమోదం తీసుకుని ప్రణాళికలు తయారు చేసి, రాష్ట్ర స్థాయిలో అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. పక్కాగా నిర్వహించి ఈనెలాఖరుకు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ముందుకు సాగుతాం. - జ్యోతి, డీఆర్డీవో.

ఉద్యాన పంటలకు పెద్దపీట..

ఉద్యాన పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించనున్నారు. తక్కువ నీటితో అధిక దిగుబడులు, వచ్చే పంటలపై అవగాహన కల్పిస్తారు. ప్రధానంగా మామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్, నిమ్మ, దానిమ్మ, ఉసిరి, బత్తాయి, సీతాఫలం, మునగ, జీడి మామిడి వంటి 12 రకాల పండ్ల తోటల సాగు చేసే వారికి ఆర్థిక భరోసా ఇవ్వనున్నారు. అయిదు ఎకరాల్లోపు భూము లున్న ఎస్సీ, ఎస్టీ, రైతులకు 90 శాతం బిందు, తుంపర పరికరాలు అందజేస్తారు. మిగిలిన వారికి పరికరాలు పంపిణీ చేయనున్నారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి: కలెక్టర్

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులైన ప్రతి ఒక్కరూ నవంబరు 6వ తేదీ లోపు ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. క్యాంపు కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కుపై ప్రచారం కల్పించాలన్నారు. గతంలో నమోదు చేసుకున్న వారు మళ్లీ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. పట్టభద్రులు 18, ఉపాధ్యాయులు 19 ఫారాలను సమర్పించాలని పేర్కొన్నారు. డిసెంబరు 9వ తేదీన ఓటరు డ్రాఫ్ట్ జాబితా ప్రకటిస్తామని చెప్పారు. అభ్యంతరాలను స్వీకరించి డిసెంబరు 25లోపు పరిష్కరిస్తామని, 30న ఓటరు తుది జాబితా ప్రకటిస్తామన్నారు. అంతకు ముందు రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి నాగిరెడ్డి హైదరాబాద్ నుంచి ఎమ్మెల్సీ ఎన్నిలపై దృశ్య సమీక్ష నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, శిక్షణ కలెక్టర్ మనోజ్, ఆర్డీవో రాజు, అధికారులు పాల్గొన్నారు.

కొత్త ఉపాధ్యాయులకు నేడు నియామకపత్రాలు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడుల్లో బోధన ఇబ్బందులు తొలగనున్నాయి. డీఎస్సీ-2024లో ఎంపికైన కొత్త ఉపాధ్యాయులు రానున్నారు. ఈ మేరకు 1:3 సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసి 1:1 ఉపాధ్యాయుల జాబితాను విద్యాధికారులు ప్రకటించారు. 397 మంది కొత్త ఉపాధ్యాయుల పేర్లను ప్రకటించారు. వీరికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నేడు నియామక పత్రాలు అందించనున్నారు. విజయ దశమి సెలవుల అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలల్లో పోస్టింగ్‌లు ఇస్తారు. అభ్యర్థులు పత్రాలు అందుకునేందుకు జిల్లా నుంచి పది ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. నారాయణఖేడ్ ఆర్డీవో కార్యాలయం, అందోలు బాలుర ఉన్నత పాఠశాల, సంగారెడ్డి స్టేడియం గ్రౌండ్, పటాన్‌చెరు ఎంపీడీవో కార్యాలయం, జహీరాబాద్ బాగారెడ్డి స్టేడియం నుంచి బుధవారం ఉదయం 8 గంటలకు బస్సులు బయలుదేరుతాయి. డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు విద్యాశాఖ ఏర్పాటు చేసిన బస్సులోనే వెళ్లాలని డీఈవో వెంకటేశ్వర్లు కోరారు.

కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు టీఎన్‌జీవో ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీర్వో పద్మజారాణి ప్రత్యేక పూజలు చేసి సంబరాలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆత్మను ప్రతిబింబించే పండగ బతుకమ్మ అని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జావీద్ అలీ, కార్యదర్శి రవి, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



బతుకమ్మలకు పూజ చేస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



గరుడవాహనంపై వేంకటేశ్వరుడు

కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ప్రతిష్ఠ మూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు, హోమ క్రతువులు నిర్వహించారు. - న్యూస్‌టుడే, గుమ్మడిదల.

రుణమాఫీకి షరతులు తగదు



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేందర్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ఎటువంటి షరతులు లేకుండా రైతులకు రుణ మాఫీ చేయాలని రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణ శివారు రైతు వేదికలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయంలో కాలయాపన చేయడం తగదన్నారు. రైతు భరోసా పథకం కింద నగదు జమ చేసి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, రామానుజరెడ్డి, పాపయ్య, సంజీవరెడ్డి, మల్లేశ్, వెంకటేశ్, శ్రీశైలం పాల్గొన్నారు.

మంత్రి సీతక్క దృష్టికి సమస్యలు

నారాయణఖేడ్: హైదరాబాద్ జ్యోతిబాపులే ప్రజాభవన్‌లో మంగళవారం మంత్రి సీతక్కను జహీరాబాద్ ఎంపీ సురేశ్‌షెట్కార్ కలిశారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాలని, సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. దీనిపై మంత్రి స్పందించారని ఎంపీ పేర్కొన్నారు. ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన చెప్పారు. సిర్గాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మనీష్‌పాటిల్ పాల్గొన్నారు.



మంత్రితో మాటడుతున్న ఎంపీ సురేశ్‌షెట్కార్

ఎంపీని కలిసిన టీఎన్‌జీవో నాయకులు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ఉద్యోగులకు రావాల్సిన డీఏ దసరాకు వచ్చేలా చూడాలని జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్‌కు టీఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు జావేద్ అలీ, నాయకులు వినతిపత్రం అందించారు. హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో ఆయనను కలిశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. జిల్లా కార్యదర్శి వి.రవి, అసోసియేట్ అధ్యక్షుడు కసిని శ్రీకాంత్, వెంకటరెడ్డి, కోశాధికారి జి.శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు అపహరణ

జహీరాబాద్, జహీరాబాద్ అర్బన్: పట్టణంలోని సాయిరామ్‌నగర్ కాలనీలో మంగళవారం మహిళ మెడలోనుంచి బంగారు గొలుసు అపహరించారు. శ్రీనగర్ కాలనీకి చెందిన తుల్జమ్మ నడుచుకుంటూ వస్తుండగా ద్విచక్రవాహనంపై వచ్చిన ఆగంతకులు ఆమె మెడలో ఉన్న గొలుసు లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అమ్మవారి కిరీటం, తాళిబొట్టు..

జహీరాబాద్ మండలం అల్గోల్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలోని అమ్మవారి కిరీటం, తాళిబొట్టు, హుండీ చోరీకి గురయ్యాయని భక్తులు ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కాశీనాథ్ తెలిపారు.

వార్డు కమిటీల జాడేది?

అభివృద్ధి పనుల్లో కనిపించని ప్రాతినిధ్యం

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ

పురపాలికల్లో వార్డు కమిటీలు నామమాత్రంగా మారాయి. వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నాలుగు రకాల కమిటీలను మూడేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. మొదట ఈ కమిటీ సభ్యులు బాగానే పనిచేసినప్పటికీ.. ఆ తర్వాత నామమాత్రంగా మారారు. కమిటీ సభ్యులు పని చేయకుండా రాజకీయ ఒత్తిళ్లు వస్తున్నాయనే ఆరోపణలున్నాయి. దీంతో వార్డుల్లో అభివృద్ధి పనులు, ఇతర కార్యక్రమాల పర్యవేక్షణను పట్టించుకునే వారే కరవయ్యారు.

- జిల్లాలో పురపాలికలు: 8
- వార్డులు: 199
- నాలుగు కమిటీల సభ్యులు: 3,184

ఒక్కో పట్టణంలో 20 మందికి అవకాశం

జిల్లాలోని 8 పురపాలక సంఘాల్లో 199 వార్డులు ఉన్నాయి. ఒక్కో వార్డుకు నాలుగు రకాల కమిటీలను పురపాలక శాఖ ఏర్పాటు చేసింది. యువత, మహిళలు, ప్రముఖులు, సీనియర్ సిటిజన్లను భాగస్వామ్యం కల్పించారు. ఒక్కో కమిటీలో 20 మంది సభ్యులకు అవకాశం కల్పించారు. ఈ నాలుగు కమిటీలకు అధ్యక్షుడిగా వార్డు కౌన్సిలర్ ఉంటారు. ఈ కమిటీ సభ్యులు ప్రతి మూడు నెలలకు ఓ సారి సమావేశం నిర్వహించి వార్డులోని సమస్యలపై చర్చించాలి. ఎక్కడెక్కడ అభివృద్ధి పనులు చేయాలో ప్రతిపాదనలు తయారు చేసి కౌన్సిలర్‌కు అందించాలి. జిల్లాలో ఎక్కడా వార్డు కమిటీల సమావేశాలు నిర్వహించడం లేదు.



సంగారెడ్డి గంజిమైదానంలో రోడ్డు పక్కనే చెత్త

ఇలా చేస్తే మేలు: ప్రస్తుతమున్న నాలుగు రకాల వార్డు కమిటీల సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి. వార్డుల్లోని సమస్యలను గుర్తించి కమిటీ సభ్యుల ద్వారా స్వీకరించాలి. అధికారులు వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటే వార్డు కమిటీ సభ్యులు ఉత్సాహంగా పని చేస్తారు. కమిటీలో అనువజ్ఞులైన వారు ఉండటంతో వార్డుల్లో అభివృద్ధి పనులు చేసేందుకు సులభంగా ఉంటుంది. అధికారులు ఈ కమిటీలు ఉత్సాహంగా పని చేసేలా ప్రోత్సహించాలని కోరుతున్నారు. ఈ కమిటీలు చురుగ్గా పనిచేస్తే వార్డుల్లో జరిగే సీసీ రోడ్లు, మురుగు కాలువలు, ఇతర పనులు నాణ్యతగా చేపట్టే అవకాశం ఉంటుంది.

శోకసంద్రమైన గణేష్‌పూర్

ముగిసిన నలుగురి అంత్యక్రియలు



సిద్రామ్ ఇంటి వద్ద విషాదం

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: న్యాల్‌కల్ మండలం గణేష్‌పూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో మృతులకు గ్రామస్థులు బాధాతప్త హృదయాలతో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. జహీరాబాద్- బీదర్ రహదారిపై సోమవారం ద్విచక్ర వాహనాన్ని కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన తండ్రి సిద్రామ్, కూతురు రేణుక, అల్లుడు జగన్నాథ్ సహా మనుమడు వినయ్‌కుమార్ మృతిచెందింది విధితమే. గణేష్‌పూర్‌లోని ఇంటి ఆవరణలో ఒకేచోట నాలుగు మృతదేహాలు ఉంచడంతో గ్రామస్థులు నివాళులర్పిస్తూ కంటతడి పెట్టుకున్నారు. అనంతరం అంత్యక్రియలు పూర్తిచేశారు. మాజీ ఎంపీ బీబీ పాటిల్, టీజీఐడీసీ మాజీ ఛైర్మన్ మహమ్మద్ తన్వీర్, కాంగ్రెస్, భాజపా, భారాస నాయకులు నివాళులు అర్పించారు.

ఆదుకోవాలని ఆందోళన...

నిబంధనలకు విరుద్ధంగా, వేగ నియంత్రణ పాటించకుండా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి నలుగురి మృతికి కారణమైన కర్ణాటక ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని గణేష్‌పూర్ గ్రామస్థులు జహీరాబాద్- బీదర్ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. వాహనాల రాకపోకలు అడ్డుకున్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి.. ఆందోళన విరమింపజేశారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గంలో ఐదుగురికి చోటు

జిన్నారం, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గంలో జిన్నారం మండలం నుంచి ఐదుగురికి చోటు లభించింది. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా గౌర్రాజు పవన్‌రాజ్(వావిలాల), మొగిలయ్య(కొడకంచి), ఉపాధ్యక్షులుగా త్రిషాల్ నాథ్(ఐడీఏ బొల్లారం), వై.బ్రహ్మరుషి(వావిలాల), కె.సత్యనారాయణ(మాదారం)లను ఎన్నుకున్నట్లు మండల అధ్యక్ష, కార్యదర్శులు అనీల్‌కుమార్, క్రిష్ణాగౌడ్‌లు మంగళవారం స్థానికంగా పేర్కొన్నారు.

ఎంపీపీ కార్యాలయం తనిఖీ

గుమ్మడిదల, న్యూస్‌టుడే: గుమ్మడిదల మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని జడ్పీ సీఈవో జానకిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం కార్యాలయానికి వచ్చిన ఆయన దస్త్రాలు పరిశీలించారు. కార్యాలయంలోని వివరాలను ఎంపీడీవో ఉమాదేవిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాలవారీగా పరిసరాల శుభ్రతపై ఆరా తీశారు. సిబ్బందితో సమావేశమైన శాఖలవారీగా పనుల పురోగతిని తెలుసుకున్నారు. తదుపరి ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీఓ దయాకర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

లాభాల డ్రాగన్

32 రకాల ప్రదర్శన ● సాగుకు ప్రోత్సాహం


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఉద్యానశాఖ అధికారులు, రైతులు

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ

డ్రాగన్ ఫ్రూట్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. జిల్లాలో సాగు విస్తీర్ణం తక్కువ, ధర ఎక్కువ కావడంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో సాగు విస్తీర్ణం పెంచేందుకు సంగారెడ్డిలోని డా.కొండా లక్ష్మణ్ బాపూజీ ఫల పరిశోధన కేంద్రం శ్రీకారం చుట్టింది. మంగళవారం డ్రాగన్ ఫ్రూట్ మేళా నిర్వహించి అవగాహన కల్పించింది. మేళాలో 32 రకాలు ప్రదర్శించారు. రెడ్ స్కిన్డ్, రాయల్ పింక్, బ్లడ్‌మారి, మిస్టర్‌వో తదితర రకాలున్నాయి.





5వేల ఎకరాల్లో సాగు లక్ష్యం..

సంగారెడ్డి జిల్లాలో డ్రాగన్ సాగుకు మంచి అవకాశాలున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సంగారెడ్డి, కొండాపూర్, జహీరాబాద్‌లో 142 ఎకరాల్లో పండిస్తున్నారు. మేళాలో పలువురు రైతులు వారి అనుభవాలు వివరించారు. జిల్లాలో తొలుత 5వేల ఎకరాల్లో సాగు చేసేలా ఉద్యానశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

రైతులకు అవగాహన కల్పించేందుకే..

– నీరజ ప్రభాకర్, ఉపకులపతి, కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం

మార్కెట్లో పండు ధరలు ఎక్కువగా ఉన్నాయి. సామాన్యులకు అందుబాటులోకి రావాలంటే జిల్లాలో సాగు విస్తీర్ణం పెరగాలి. ఈ ఉద్దేశంతోనే ఫల పరిశోధన కేంద్రంలో మేళా నిర్వహించాం. రైతులు అనుభవాలు వివరించారు. చక్కెర శాతం తక్కువగా ఉండడంతో మధుమేహులూ తినొచ్చు.

ఎకరాకు పది లక్షల పండ్లు

– డా.హరికాంత్, సీనియర్ శాస్త్రవేత్త, ఎఫ్ఆర్ఎస్


పంటపై రైతులకు ఇప్పుడిప్పుడే అవగాహన కలుగుతోంది. జిల్లాలో 150 ఎకరాల్లో డ్రాగన్ పంట సాగవుతోంది. ఒక్కో పండు రూ.100- 150 ఉంటుంది. జూన్- ఆగస్టు మధ్యలో దిగుబడి వస్తుంది. ఎకరాకు 10 లక్షల పండ్లు పండించొచ్చు. పంట ఎలా సాగు చేయాలో రైతులకు వివరించాం.

పాడైనా నష్టం లేదు..

డ్రాగన్ పండ్లు విక్రయం కాకున్నా పారేయాల్సిన అవసరం లేదు. పాడైన వాటితోనూ వివిధ రకాల వస్తువులు తయారు చేయొచ్చని ప్రదర్శనలో చూయించారు. సబ్బులు, పాపడ్, గుల్మన్, క్యాండి, లిప్ బామ్, చిప్స్‌ను ఎలా తయారు చేయొచ్చో ప్రయోగాత్మకంగా వివరించారు.


మేళాలో ప్రదర్శించిన ఉద్యాన పంటల విలువ ఆధారిత వస్తువులు

అవగాహన కల్పించారు.. ఇక సాగు చేస్తా..



ఇప్పటి వరకు ఎన్నో పంటలు సాగు చేశా. పెట్టుబడి ఎక్కువగా పెడుతున్నా ఆశించిన లాభాలు మాత్రం రావడం లేదు. మేళాకు రావడంతో డ్రాగన్ ఎలా సాగు చేయాలో తెలుసుకున్నా. ఈసారి పండించాలని నిర్ణయించుకున్నా.

– విశ్వప్రసాద్, రైతు, మారేపల్లి

65 రకాలు పండించా..



65 రకాల పండ్లు పండించా. ఏడాదిపాటు కష్టపడితే రెండేళ్ల తరవాత కోతకు వస్తుంది. పెట్టుబడికి రెండింతల లాభాలొస్తాయి. దీనిపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరముంది. అధికారులు ప్రోత్సహిస్తే చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగంగా ఉంటుంది.

– రమేశ్‌రెడ్డి, రైతు, రంజోల్, జహీరాబాద్

గతేడాది రూ.7 లక్షల ఆదాయం



మూడేళ్లుగా రెండెకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ పండిస్తున్నా. ఎకరాకు రూ.3.50 లక్షల పెట్టుబడి పెట్టా. గతేడాది రూ.7 లక్షల ఆదాయం వచ్చింది. ఈసారి రూ.12 లక్షలు ఆర్జించా. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని అన్నదాతలను ప్రోత్సహించాలి.

– మదన్ మోహన్‌రెడ్డి, రైతు, తెర్పోల్


పతకాలు, ప్రశంసాపత్రాలతో మెదక్ జట్టు క్రీడాకారిణులు, అదనపు పాలనాధికారి వెంకటేశ్వర్లు, డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డి, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్

రాష్ట్ర ఫుట్‌బాల్ ఛాంపియన్ మెదక్

మెదక్ టౌన్: పాఠశాల క్రీడ సమాఖ్య(ఎస్జీఎఫ్) 68వ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ అండర్-17 బాలికల ఛాంపియన్‌గా మెదక్ జట్టు నిలిచింది. గత మూడు రోజుల నుంచి మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియం, వెస్లీ పాఠశాల మైదానంలో కొనసాగుతున్న ఫుట్‌బాల్ పోటీలు మంగళవారం ఉత్సాహంగా ముగిశాయి. లీగ్ దశ నుంచి అత్యంత ప్రతిభ కనబర్చిన మెదక్, రంగారెడ్డి జట్లు ఫైనల్ పోరుకు అర్హత సాధించాయి. రంగారెడ్డి-1, మెదక్-2 పాయింట్లు సాధించడంతో ఛాంపియన్‌గా ప్రకటించారు.


ఫైనల్‌లో తలపడుతున్న మెదక్, రంగారెడ్డి జిల్లాల క్రీడాకారిణులు

క్రీడలతో మంచి భవిష్యత్తు

క్రీడలపై దృష్టి పెట్టి రాణించిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. బహుమతుల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ... మెదక్ ప్రథమ, రంగారెడ్డి ద్వితీయ, నిజామాబాద్ తృతీయ స్థానాల్లో నిలిచాయన్నారు. అనంతరం విజేతలకు డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పతకాలు, జ్ఞాపికలను అందజేశారు. పోటీల కోఆర్డినేటర్ నాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసరావు, పీడీలు ప్రతాప్‌సింగ్, మాధవరెడ్డి, రవి, సత్యం పాల్గొన్నారు.

మహాలక్ష్మీదేవిగా చదువుల తల్లి


ప్రసిద్ధ వర్గల్ విద్యా సరస్వతి క్షేత్రంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం విద్యా సరస్వతి అమ్మవారిని శ్రీమహాలక్ష్మిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.
- న్యూస్‌టుడే, వర్గల్

కమనీయ రూపం.. కాత్యాయనీ అవతారం

వికారాబాద్ వైభవలక్ష్మి ఆలయంలో మంగళవారం అమ్మవారు కాత్యాయనీ దేవిగా (గాయత్రీ దేవి)గా దర్శనమిచ్చారు. అమ్మ రూపాన్ని చూసి భక్తులు తన్మయత్వం చెందారు.
- న్యూస్‌టుడే, వికారాబాద్ మున్సిపాలిటీ



రాష్ట్ర స్థాయి ఖోఖో బాలికల జట్ల ఎంపికలు



నర్సాపూర్: నర్సాపూర్ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో ఖేలో ఇండియా ఖోఖో ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్, సబ్ జూనియర్ బాలికల ఎంపిక పోటీలను మంగళవారం నిర్వహించారు. రెండు విభాగాల్లో అయిదుగురు చొప్పున ఎంపిక చేశారు. వారు ఈనెల 9వ తేదీన నల్గొండలో జరిగే రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా ఎంపిక పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించారన్నారు. కన్వీనర్ మహేందర్‌రావు, సభ్యులు పోచప్ప, నాగరాజు, నర్సాపూర్ బాలుర ఉన్నత పాఠశాల పీడీ శ్రీకాంత్‌గౌడ్ సమక్షంలో ఎంపిక పోటీలు నిర్వహించారు.

చేతివృత్తులకు పునరుజ్జీవం

పీఎం విశ్వకర్మ పథకంతో స్వయం ఉపాధికి భరోసా

న్యూస్‌టుడే, కొండపాక గ్రామీణం

పోటీ ప్రపంచంలో గ్రామీణ వడ్రంగులు తయారు చేసే సాంప్రదాయ వస్తువులకు విపణిలో ఆదరణ కరవై అనేక మంది వృత్తిని వదిలేసి ఇతర రంగాల వైపు వెళుతున్నారు. యంత్రాలతో పోటీపడలేక గ్రామీణ పేద విశ్వకర్మలు నిత్యం జీవనోపాధికి కూలీ, ఇతర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి వారికి ఉచితంగా అధునాతన నైపుణ్య శిక్షణ, ఆర్థిక సహకారం అందించి ప్రోత్సహించేందుకు అందుబాటులోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వ పథకమే పీఎం విశ్వకర్మ.


కుకునూరుపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శిక్షణ

ఆన్‌లైన్‌లో దరఖాస్తు..

ఈ పథకంలో దాదాపు 18 రకాల సాంప్రదాయ కళాకారులు, చేతివృత్తుల వారికి ఉచితంగా నైపుణ్య శిక్షణ అందించి వారు స్వయం ఉపాధి పొందేలా కేంద్రం ప్రోత్సహిస్తోంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌తోపాటు దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత శాఖ అధికారులు కొందర్ని ఎంపిక చేస్తారు. వారిని బృందాలుగా విభజించి స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలకు పంపుతారు. అక్కడ శిక్షకుడు అయిదు రోజులపాటు పాఠాలు బోధించడంతోపాటు అధునాతన నైపుణ్య శిక్షణ అందిస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రంతోపాటు రోజుకు రూ.500 చొప్పున ఉపకార వేతనం అందిస్తారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో పీఎం విశ్వకర్మ శిక్షణకు ఎంపికైన 33 మంది మొదటి బ్యాచ్ అభ్యర్థులకు అధునాతన వడ్రంగి నైపుణ్య శిక్షణ విజయవంతంగా పూర్తయింది. మరో బ్యాచ్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. పీఎం విశ్వకర్మ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు త్వరలోనే రూ.15 వేల టూల్ కిట్ అందనుంది. సొంతంగా వ్యాపారం చేసుకోవాలని భావిస్తే పీఎం విశ్వకర్మ ధ్రువపత్రాల ఆధారంగా రూ.1- 3 లక్షల వరకు బ్యాంకులు లోన్ సదుపాయం కల్పించనున్నాయి. దీంతో విశ్వకర్మల జీవితాల్లో వెలుగులు నింపి ఉన్నతంగా ఎదగడానికి ఎంతో ఉపయోగపడనుంది.

సద్వినియోగం చేసుకోండి..

–వెంకటరమణ, ప్రిన్సిపల్, ఐటీఐ కళాశాల, కుకునూరుపల్లి

పీఎం విశ్వకర్మ శిక్షణతో స్వయం ఉపాధితో స్థిరపడాలనుకుంటున్న వారికి ఉపయోగపడుతుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పీఎం విశ్వకర్మ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సొంతంగా దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి బ్యాంకులు రుణ సదుపాయం కల్పిస్తాయి.


తయారు చేసిన కళాకృతులు

సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరంలో నిజాం కాలంలో నిర్మించిన చెరువు, పరిసరాలు ప్రజలకు ఆహ్లాదం కలిగిస్తున్నాయి. ఈ చెరువును 1891లో నిర్మించారు. నిండుగా, అందమైన పరిసరాలతో కూడిన ఈ ప్రాంతానికి చుట్టుపక్కల మండలాల ప్రజలు సెలవు రోజుల్లో వస్తుంటారు. ఇది 5,100 ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందిస్తోంది.
– న్యూస్‌టుడే, కోహెడ గ్రామీణం


కొండల మధ్య చెరువు.. ఆహ్లాదానికి నెలవు

చారిత్రక వైభవం.. భవానీమాత ఆలయం

న్యూస్‌టుడే, జహీరాబాద్: దసరా అంటేనే నవరాత్రులు గుర్తుకొస్తాయి. అమ్మవారిని పూజించటం ఈ పండగ ప్రత్యేకత. తుల్జాభవానీ అమ్మవారు వెలిసిన ఆలయం అనగానే మహారాష్ట్రలోని తుల్జాపూర్ అని అందరికీ తెలుసు. సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం ఖాన్‌జమాల్‌పూర్(భవానమ్మపల్లె)లో కొలువైన తుల్జాభవానీ మాత ఆలయానికీ అంతటి చరిత్ర ఉందని పూర్వీకులు చెబుతున్నారు. రాష్ట్ర సరిహద్దులోని ఈ గ్రామంలో దాదాపు 800 ఏళ్ల కిందట ఛత్రపతి శివాజీ మహారాజ్ ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్రకారులు తెలిపారు. యుద్ధానికి వెళుతూ జహీరాబాద్‌కు 15 కి.మీ. దూరంలోని ఖాన్‌జమాల్‌పూర్‌లో సేదతీరారని, విజేతగా వస్తే అమ్మవారి ఆలయం నిర్మిస్తానని మొక్కుకున్నారని చరిత్ర చెబుతోంది. ఆయన విజయం సాధించాక ఆలయం నిర్మించారని తెలుస్తోంది.




ఆలయంలో కొలువైన అమ్మవారు

చెక్కు చెదరని మెట్ల బావి...: ఆలయం చుట్టూ ప్రహరీ, కొంత దూరంలో కందకం, ప్రధాన ద్వారం నిర్మించారు. ఆలయం పక్కనుంచి లోతైన సొరంగ మార్గమున్న ఆనవాళ్లు ఇప్పటికీ కనిపిస్తాయి. గుడి పక్కనే ఎర్ర రాయితో నిర్మించిన మెట్ల బావి ఇప్పటికీ చెక్కుచెదరలేదు. శిథిలావస్థకు చేరుతున్న ఆలయ పునర్నిర్మాణానికి దాతలు ముందుకొస్తున్నారు. ప్రతి మంగళ, శుక్రవారాలతోపాటు దసరా, దీపావళి, అమావాస్య, పౌర్ణమి రోజుల్లో భక్తులు వస్తుండటంతో ఏడాదిపాటు ఆలయం సందడిగా మారుతోంది. దసరా పండగకు భక్తులు భారీగా తరలి రానుండడంతో ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. మరింత అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

12 ఏళ్లుగా పాదయాత్ర..: ఛత్రపతి శివాజీ నిర్మించిన ఆలయ ప్రాధాన్యాన్ని వివరించేందుకు 12 ఏళ్లుగా ఈ ప్రాంతంలోని యువకులు పెద్ద ఎత్తున పాదయాత్ర నిర్వహిస్తున్నారు. పరిసర గ్రామాలకు చెందిన యువకులు పదుల సంఖ్యలో పాల్గొని ఏటా దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని పురాతన భవానీమాత ఆలయం నుంచి ఖాన్‌జమాల్‌పూర్ భవానమ్మపల్లె వరకు పాదయాత్ర చేస్తుంటారు. ఈనెల 10న ఉదయం పాదయాత్రకు ఏర్పాట్లు చేశారు.

మూఢ నమ్మకాల నిర్మూలనపై ప్రచార కార్యక్రమాలు


మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, బాధ్యులు

మెదక్, న్యూస్‌టుడే: గ్రామాల్లో కులాల మధ్య ఆధిపత్య పోరు సమాజంలో అంతరాలు పెంచేలా ఉందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలిమెల రాజేశ్వర్ అన్నారు. మంగళవారం వేదిక బాధ్యులు కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ ఏజెన్సీ ప్రాంతాల కంటే మారుమూల పల్లెల్లో మూఢనమ్మకాలు అధికంగా ఉన్నాయన్నారు. రామాయంపేట మండలం క్యాత్రియాల్‌లో ఇటీవల దాయాదుల మధ్య నెలకొన్న గొడవల కారణంగా ముత్యవ్వను సజీవ దహనం చేశారన్నారు. ఈ ఘటనపై డీజీపీని కలిశామని, ఆయన సూచన మేరకు దసరా తర్వాత జిల్లాలో పోలీస్, రెవెన్యూ శాఖల సహకారంతో ప్రజాచైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మూఢ నమ్మకాలను నిర్మూలించేలా ప్రచార కార్యక్రమాలు చేపడతామన్నారు. రాష్ట్ర బాధ్యులు పద్మ, మహేందర్, వెంకట్ రమణారెడ్డి, పాల్‌రాజ్, వరప్రసాద్, నాగభూషణం, జిల్లా కార్యదర్శి దేవ్లా పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడు లింగమయ్యగౌడ్ మృతి



జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు, తామరపత్ర గ్రహీత గడీండ్ల లింగమయ్యగౌడ్ (96) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని ఆయన జైలుపాలయ్యారు. కర్ణాటక గుల్బర్గా జైలులో 25 రోజులున్నారు. 50 ఏళ్ల స్వాతంత్య్ర వేడుకల్లో అప్పటి రాష్ట్రపతి కేఆర్ నారాయణ చేతుల మీదుగా రాష్ట్రపతి భవనంలో సత్కారం పొందారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

నర్సాపూర్ రూరల్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సాపూర్ మండలంలో జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాలు.. బ్రాహ్మణపల్లికి చెందిన గుండే కరుణాకర్(45) కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఏడాది క్రితం పెద్దకూతురు వివాహం చేశాడు. పెళ్లికి అయిన అప్పు ఎలా తీర్చాలని తరచూ ఆవేదన చెందేవాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పిల్లలు వచ్చేసరికి చనిపోయాడు. భార్య సంతోష ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

మద్యం మత్తులో మరొకరు...

ఆదిలాబాద్ నేర విభాగం: ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్‌కాలనీలో అద్దెకు ఉంటున్న దీపల్లి నరేందర్‌రెడ్డి(27) సోమవారం రాత్రి అద్దె ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. వికారాబాద్ జిల్లా మేడికొండకు చెందిన దీపల్లి నరేంద్రరెడ్డి మూడేళ్ల కిందట ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అమ్మాయిని వివాహం చేసుకొని ఏడాదిన్నరగా టీచర్స్ కాలనీలో ఉంటున్నట్లు మావల ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. మద్యం మత్తులో ఉరేసుకొని ఉంటాడని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు వికారాబాద్ నుంచి వచ్చాక వివరాలు తెలిసే అవకాశం ఉందన్నారు.

స్తంభానికి కట్టేసి కొట్టారని ఏడుగురిపై కేసు



శివ్వంపేట, న్యూస్‌టుడే: వ్యక్తిని స్తంభానికి కట్టేసి దాడి చేసిన ఏడుగురిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. శివ్వంపేట ఎస్సై మహిపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట మండలం గోమారం గ్రామానికి చెందిన కమ్మరి కృష్ణ ఈనెల 1న తను స్నానాల గదిలో ఉండగా చూశాడని ఓ మహిళ.. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. మరుసటి రోజు ఇంట్లో పడుకొని ఉండగా మహిళ కుటుంబ సభ్యులు బయటికి లాక్కొచ్చి స్తంభానికి కట్టేసి కర్రలతో కొట్టారని కృష్ణ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మహిళతో పాటు ఏడుగురిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

సంచికి దూరం.. సృజనకు చేరువ

వర్గల్, న్యూస్‌టుడే: వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో సంచికి దూరం కార్యక్రమం మంగళవారం ముగిసిందని, పిల్లల్లో సృజనాత్మకత పెంచడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహించామని ప్రిన్సిపల్ రాజేందర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు రంగులద్దడం, ముగ్గులు వేయడం, క్రీడలు, సంచుల తయారీ, కుట్టు మిషన్ లో మెలకువలు, నర్సరీలో మొక్కలు పెంచడం, కూరగాయల సాగు, వీణ, వయోలిన్ వాయిండచం, తదితర అంశాల్లో మెలకువలు నేర్పించామన్నారు. విద్యాలయ పూర్వ విద్యార్థి డాక్టర్ సాయినాథ్ రెడ్డి పలు సూచనలిచ్చారు.


ఫ్లూట్, వయోలిన్ వాయిస్తున్న విద్యార్థులతో ప్రిన్సిపల్ రాజేందర్, ఉపాధ్యాయ బృందం

గుంతలో పడి వ్యక్తి మృతి


లక్ష్మయ్య

కౌడిపల్లి, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై వస్తూ రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన కౌడిపల్లి మండలం కొత్తచెరువు తండా గ్రామ పంచాయతీ మొండితండా వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. చిలప్‌చెడ్ మండలం సోమక్కపేట గ్రామానికి చెందిన చీమల లక్ష్మయ్య(49) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి ద్విచక్రవాహనంపై వస్తుండగా.. మొండితండా వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలో పడిపోయాడు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు కిషన్‌నాయక్ గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. కుటుంబీకులు వచ్చి లక్ష్మయ్యను ఆటోలో నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు నవీన్ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. లక్ష్మయ్యకు భార్య భూదెమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం

రాయపోల్, న్యూస్‌టుడే: బైక్‌పై వెనుక కూర్చున్న మహిళ రోడ్డుపై పడగా.. ఆమె పైనుంచి వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం లింగారెడ్డిపల్లి శివారులో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, రాయపోల్ ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాలు... గజ్వేల్ మండలం జాలిగామకు చెందిన రాసమల్ల సూరమ్మ (60) వారి వియ్యంకుడి మూడో రోజు కర్మ కార్యక్రమంలో పాల్గొనడానికి రాయపోల్ వెళ్లింది. తర్వాత రాత్రి జాలిగామకు చెందిన రమేశ్ బైక్‌పై వస్తుండగా ప్రమాదవశాత్తు ఆమె కింద పడింది. అదే సమయంలో వచ్చిన గుర్తు తెలియని వాహనం పైనుంచి వెళ్లగా తీవ్రగాయాలతో చనిపోయింది. ఆమె భర్త రాములు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

పోలీసుల అదుపులో ఆరుగురు ● నాలుగేళ్లుగా 36 చోరీలు

మాదాపూర్: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న మధ్య ప్రదేశ్‌కు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా సైబరాబాద్ సీసీఎస్ పోలీసులకు పట్టుబడింది. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లతోపాటు సంగారెడ్డి, మెదక్, నల్గొండ జిల్లాల్లో 36 చోరీలకు పాల్పడిన రెండు ముఠాలకు చెందిన ఆరుగురు ఘరానా దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి ఆరు కత్తులతోపాటు కట్టర్లు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, సైబరాబాద్ క్రైమ్స్ విభాగం డీసీపీ నర్సింహ తెలిపిన వివరాలు.. మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లా కుక్షి తహసీల్‌లోని ఖనియాంబకు చెందిన కరన్ మనోహర్‌బాబర్, ప్యార్‌సింగ్ బవుల, డెబ్రాబవుల, కడక్‌సింగ్, చిరాడ్‌కు చెందిన ఠాకూర్ ఈడియ, కుమన్ ఈడియ జల్సాలకు అలవాటు పడి చోరీల బాటపట్టారు. కరన్ మనోహర్‌బాబర్, కడక్‌సింగ్ నేతృత్వంలో రెండు ముఠాలుగా ఏర్పడి తెలుగు రాష్ట్రాల్లో చోరీలు చేస్తున్నారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీలు శ్రీనివాస్, నర్సింహ

ఆయుధాలతో సంచరిస్తూ..

గతనెల 19, 20, 21వ తేదీల్లో మియాపూర్, బాచుపల్లి, సూరారం, పేట్‌బషీరాబాద్ ఠాణాల పరిధుల్లో చోరీలకు పాల్పడ్డారు. సైబరాబాద్ కమిషనర్ ఆదేశాల మేరకు సీసీఎస్ మాదాపూర్, సీసీఎస్ బాలానగర్ జోన్ బృందం పోలీసుల సహకారంతో దర్యాప్తు చేపట్టారు. సోమవారం కరన్ మనోహర్‌బాబర్ బృందంతో కలిసి మియాపూర్‌లో ఆయుధాలు, కట్టర్లున్న సంచులతో సంచరిస్తూ పట్టుబడ్డారు. కడక్‌సింగ్ ముఠా వివరాలు చెప్పడంతో పోలీసులు అందరినీ అదుపులోకి తీసుకున్నారు.

మరో 8 మంది పరారీ..

రెండు ముఠాలకు చెందిన సమర్‌సింగ్, మోహన్, అర్జున్, దయాసింగ్, కైలాష్, భురియా, సొత్తు కొంటున్న రోహిత్‌సోని, గౌరవ్ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

బాలుడి చికిత్సకు రూ.3 లక్షల సాయం



సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు

నారాయణఖేడ్, కల్హేర్: అనారోగ్యంతో బాధపడుతున్న కల్హేర్ మండలం రాపర్తికి చెందిన శేఖర్ కుమారుడు హర్షవర్ధన్ చికిత్సకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అనుపమ దంపతులు మంగళవారం సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.3 లక్షల పత్రాలను ఇచ్చారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శివరాథోడ్, పండరిరెడ్డి, అఖిలేష్‌రెడ్డి పాల్గొన్నారు.

‘కొత్త క్రషర్ పనులు నిలిపివేయండి’

జిన్నారం: హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు రాళ్లకత్వ శివారు 286 సర్వే నంబరులో నిర్మిస్తున్న కొత్త కంకర క్రషర్ పనులు నిలుపు చేయాలని గ్రామస్థులు మండల స్థాయి అధికారులను కోరారు. ఈమేరకు వారు కోర్టు ఉత్తర్వు కాపీని మంగళవారం వారికి అందించారు. క్వారీల ఏర్పాటు వల్ల పంట పొలాలకు నష్టం వాటిల్లుతుందని యువజన నాయకుడు రామకృష్ణ వాపోయారు.

దసరా తర్వాత సోయాబీన్ కొనుగోలు

ఝరాసంగం: దసరా తర్వాత సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని ఝరాసంగం సొసైటీ ఛైర్మన్ గౌసొద్దీన్, కార్యదర్శి నిస్సార్ అహ్మద్‌లు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు ప్రారంభించి మద్దతు ధర క్వింటాలుకు రూ. 4892లు చెల్లిస్తామన్నారు.

కల్హేర్ పీఆర్ ఏఈగా వినయ్‌కుమార్

కల్హేర్: కల్హేర్ మండల పంచాయతీరాజ్ శాఖ ఏఈగా వినయ్‌కుమార్‌ను నియమిస్తూ కలెక్టర్ క్రాంతి ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

టేక్మాల్, న్యూస్‌టుడే: మండల పరిధి కాజులూరు, దనూర, టేక్మాల్ విద్యుత్తు కేంద్రాల పరిధిలో బుధవారం విద్యుత్తు సరఫరా ఉండదని పాపన్నపేట ఏడీఈ బాబుమోహన్ తెలిపారు. ఉపకేంద్రాల పరిధిలో తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తారన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. వ్యవసాయ పొలాలకు సరఫరా ఉండదని, గ్రామాలకు సింగిల్ ఫేజ్ విద్యుత్తు సరఫరా ఉంటుందన్నారు.

వీధి వ్యాపారులకు.. భరోసా

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ

కుటుంబ వివరాల సేకరణకు ఆదేశాలు



పట్టణాల్లోని వీధి వ్యాపారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పటివరకు రుణాలు ఇప్పించి వ్యాపార వృద్ధికి మెప్మా(పట్టణ పేదరిక నిర్మూలన) అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇక నుంచి వారి కుటుంబ ఆర్థిక స్థితిగతులతో పాటు ప్రభుత్వ పథకాలు ఇప్పించేలా కార్యాచరణ రూపొందించారు. ఇందు కోసం వారి కుటుంబ వివరాలు సేకరించనున్నారు. ఇప్పటికే సంగారెడ్డి, జహీరాబాద్ పురపాలికల్లో ఈ కార్యక్రమం మొదలైంది.

పురపాలికల వారీగా వ్యాపారులు

పురపాలక సంఘం	వీధి వ్యాపారులు
సంగారెడ్డి	6,239
సదాశివపేట	4,214
జహీరాబాద్	7,294
అందోలు-జోగిపేట	820
నారాయణఖేడ్	629
బొల్లారం	1,424
అమీన్‌పూర్	1,249
తెల్లాపూర్	1,420

పథకాలు అందించడమే లక్ష్యం..

జిల్లాలోని 8 పురపాలక సంఘాల్లో 23,289 మంది వీధి వ్యాపారులు ఉన్నారు. వీరికి మెప్మా ద్వారా మొదటి విడత రూ. 10 వేలు, రెండో విడత రూ.20 వేలు, మూడో విడత రూ.50 వేలు రుణాలిచ్చారు. రుణాలు పొందిన వీరి ఆర్థిక స్థితిగతులను తెలుసుకునేందుకు సర్వే చేస్తున్నారు. వారి కుటుంబ సభ్యుల వివరాలు, పిల్లలు చదువుకుంటున్నారా..? ఇతర వ్యాపారం చేస్తున్నారా..? ఆదాయం ఎంత వంటి వివరాలు సేకరించి అంతర్జాలంలో నమోదు చేస్తారు. వీటిని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర శాఖలకు కూడా పంపుతారు. ఈ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలపై వ్యాపారులకు అవగాహన కల్పించి అర్హులు రుణాలు పొంది వినియోగించుకునేలా తగు చర్యలు తీసుకుంటారు. ఈ సర్వే వ్యాపారులు మరింత ఆర్థికంగా ఎదిగేందుకు దోహదం చేయనుంది.

పూర్తి వివరాలు సేకరిస్తున్నాం

జిల్లాలోని 8 పురపాలికల్లో వీధి వ్యాపారుల కుటుంబ వివరాలు సేకరిస్తున్నాం. నెల రోజుల్లో పూర్తి వివరాలు సేకరించాలని నిర్ణయించాం. ఎప్పటికప్పుడు వారి వివరాలను ఆన్‌లైన్ చేయిస్తున్నాం. వారికి అవసరమైన ప్రభుత్వ పథకాలు అందించేలా చర్యలు తీసుకుంటాం. - మల్లీశ్వరి, మెప్మా డీఎంసీ.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఫోన్ చేయాల్సిన నంబర్లు (10AM TO 1 PM) సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363, నారాయణఖేడ్ 8008573248, పటాన్‌చెరు 8008573250, అందోలు 8008573241, జిన్నారం 8008573231

న్యూస్‌టుడే, నారాయణఖేడ్, జోగిపేట, సంగారెడ్డి అర్బన్

? ఖేడ్ పట్టణంలోని దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సంస్థల వద్ద వ్యర్థాలు, చెత్తను రోడ్డుపైనే వేస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలతో పాటు స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - **వెంకటి, ఖేడ్.**

✓ వ్యాపారులు వ్యర్థాలు, చెత్తను బయట పడేయకుండా నిత్యం దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సదుపాయాల వద్దకు వచ్చే ఆటోల్లోనే వేయాలని ఆదేశాలు జారీ చేస్తాం. - **శ్రీనివాస్, పారిశుద్ధ్య పర్యవేక్షకులు.**

? అందోలు గూడెంలోని రెండు పడకల ఇళ్లవద్ద ముళ్లపొదలు ఏపుగా పెరిగిపోయాయి. దీంతో దోమలు అధికమవుతున్నాయి. **-గోపాల్, అందోలు.**

✓ రెండు పడకల ఇళ్లవద్ద పెరిగిన పొదలు తొలగించి శుభ్రం చేస్తాం. కాలనీవాసులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం. **-తిరుపతి, పుర కమిషనర్, అందోలు- జోగిపేట.**

? కన్‌సానిపల్లి గ్రామానికి వెళ్లే దారి శిథిలావస్థకు చేరింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **-బాలయ్య, కన్‌సానిపల్లి.**

✓ దారిని పరిశీలించి మరమ్మతులకు తగు చర్యలు తీసుకుంటాం. **-రవీందర్, డిప్యూటీ ఈఈ ర.భ శాఖ అందోలు.**

? సంగారెడ్డి పట్టణంలోని రిక్షాకాలనీలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళలలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మరమ్మతులు చేసి ఆదుకోవాలి. **-సుల్తానా, రిక్షాకాలనీ, సంగారెడ్డి.**

✓ సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటాం. **-ప్రసాద్‌చౌహాన్, కమిషనర్, సంగారెడ్డి.**

ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: నారాయణఖేడ్ పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు గ్రామ కూడళ్లలో బతుకమ్మలను పేర్చి వాటిచుట్టూ తిరుగుతూ లయబద్ధంగా పాటలు పాడారు. అనంతరం సమీప చెరువులు, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనాలకు తరలించారు. చెరువుల వద్ద పురపాలిక సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: జోగిపేట ట్రాన్స్‌కో కార్యాలయ ఆవరణలో బతుకమ్మ పండుగ వేడుకలు మంగళవారం డీఈఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉద్యోగుల కుటుంబ సభ్యులు, మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి కార్యాలయ ఆవరణలో పెట్టి ఆడిపాడారు. ఈ ఉత్సవంలో ఏఈలు దుర్గయ్య, శ్రీనివాస్, నాగరాజు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.



నారాయణఖేడ్ మండలం ర్యాకల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



జోగిపేట విద్యుత్తు కార్యాలయ ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న విద్యుత్తు ఉద్యోగులు

సీపీఎం కార్యదర్శిగా రమేష్

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: సీపీఎం ఖేడ్ ప్రాంత కమిటీ కార్యదర్శిగా నల్లపల్లి రమేష్, సభ్యులుగా అరుణ్‌కుమార్, సతీష్, సంగ్రాం, శకుంతల మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖేడ్‌లో మంగళవారం నిర్వహించిన పార్టీ మహాసభల్లో ఈ ఎన్నిక నిర్వహించినట్లు పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమెలమాణిక్ తెలిపారు.

బతుకమ్మ ఘాట్ ప్రారంభం నేడు

జిన్నారం: ఐడీఏ బొల్లారం పురపాలిక పరిధిలోని కుడికుంట వద్ద నిర్మించిన బతుకమ్మ ఘాట్‌ను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బుధవారం ఉదయం 8.30 గంటలకు ప్రారంభిస్తారని పుర ఛైర్‌పర్సన్ రోజారాణి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ముమ్మరంగా భాజపా సభ్యత్వాలు



నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలో మంగళవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. కేంద్రం అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరిస్తూ సభ్యత్వాలు తీసుకున్నారు. ఆ పార్టీ ఖేడ్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రవిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు పత్తిరి రామకృష్ణ, నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్, మండల పార్టీ అధ్యక్షులు దశరథ్, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

వట్‌పల్లి దర్గాకు బస్సు నడపండి

వట్‌పల్లి, న్యూస్‌టుడే: వికారాబాద్ జిల్లా కేంద్రం నుంచి వట్‌పల్లి వెంకట ఖ్వాజా చిష్తి దర్గా వరకు భక్తులకు సౌకర్యార్థం ఆర్టీసీ బస్సు సేవలు ప్రారంభించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఆర్టీసీ సంస్థ ఈడీ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ట్రస్టు ఉపాధ్యక్షుడు రాములు చిష్తి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖేడ్ డిపో నుంచి వట్‌పల్లి సదాశివపేట, సంగారెడ్డి డిపో నుంచి వట్‌పల్లి వరకు ఆర్టీసీ బస్సు సేవలు అందించడం వల్ల భక్తులకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. వికారాబాద్ నుంచి వచ్చే భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బస్సు సౌకర్యం కల్పించాలని కోరినట్లు తెలిపారు.

పారిశుద్ధ్యం... అధ్వానం



సదాశివపేట పట్టణంలోని శాస్త్రీరోడ్డు, సుభాష్ రోడ్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. దారులు అపరిశుభ్రంగా మారాయి. గాలి వీచినప్పుడు దారుల్లోని చెత్త ఇళ్లల్లోకి వస్తోందని పరిసర ప్రాంత ప్రజలు వాపోతున్నారు. పండుగ సీజన్ కావడంతో దారుల్లో మరింతగా చెత్త పేరుకుంటోంది. పురపాలిక అధికారులు స్పందించి ప్రతిరోజు చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, సదాశివపేట.

ఏళ్లుగా ఎండుతూ.. తడుస్తూ...!



చిన్నపాటి మరమ్మతులకు గురైన జిల్లా వైద్యారోగ్య శాఖకు చెందిన వాహనాలు ఏళ్లుగా నిరుపయోగంగా మారాయి. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తున్నాయి. రూ.లక్షల విలువైన వాహనాలకు కనీస రక్షణ లేకుండాపోయింది. వీటిల్లో చిన్నపాటి లోపాలున్న వాటిని సరిచేస్తే వినియోగించుకోవచ్చు. మరికొన్ని కాలంచెల్లినవి కావడంతో వాటిని ఆర్టీఏ అధికారుల సహకారంతో తుక్కు కింద మార్చితే కొంతవరకైనా ఆదాయం వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. – న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్.

దాడిచేసిన వారిపై కేసు నమోదు

శివ్వంపేట, న్యూస్‌టుడే: దాడిచేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు శివ్వంపేట ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కొత్తపల్లికి చెందిన ఆగం శ్రీనివాస్ ఈ నెల 6న సాయంత్రం మేకల్ని కొట్టంలో ఉంచి, పొలంలోకి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చి చూడగా మేక కనిపించలేదు. మేక కోసం శివ్వంపేట మండలం చాకరిమెట్ల వైపు వచ్చి వెతుకుతూ ఉండగా అతని ఇద్దరు కుమారులు ప్రవీణ్, నవీన్ వారి మిత్రుడు సురేష్ ఎదురు పడగా మేక గురించి వాకబు చేశారు. మేమే అమ్ముకున్నాం అంటూ దూషిస్తూ తనతో పాటు వచ్చిన వారిపై కర్రలతో దాడిచేశారు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ‘మేము సైతం’



గుమ్మడిదల, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు ‘మేము సైతం’ అండగా నిలుస్తామని యువజన సంఘ సభ్యులు మంగళవారం సమావేశమై తీర్మానం చేశారు. మంగళవారం నల్లవల్లిలో అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ప్యారనగర్‌లో నిర్మించ తలపెట్టిన డంపింగ్ యార్డు(చెత్తదిబ్బ)కు వ్యతిరేకంగా పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నమని నినాదాలు చేశారు. కమిటీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో పాల్గొంటామని తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కల్హేర్, న్యూస్‌టుడే: వరికి తెగులు సోకడంతో నష్టం కలుగుతుందని, రైతులు అప్రమత్తతతో మెలగాలని నారాయణఖేడ్ వ్యవసాయ డివిజన్ సహాయక సంచాలకుడు నూతన్‌కుమార్ సూచించారు. ఆయన మంగళవారం కల్హేర్ మండలంలోని మీర్ఖాన్‌పేట్ గ్రామంలోని వరి పంట పొలాలను రైతులతో కలిసి పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ క్రిష్ణవేణి, గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత

ఈనాడు కథనానికి స్పందన

గుమ్మడిదల, న్యూస్‌టుడే: ‘దారుల్లో గుంతలు.. రాకపోకలకు తిప్పలు’ అనే శీర్షికన ఇటీవల ‘ఈనాడు’లో వచ్చిన కథనానికి పంచాయతీ సిబ్బంది స్పందించారు. పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్‌రావు గ్రామ పరిధిలోని మన్నె గూడెం దారిలో ఏర్పడిన గుంతలను పరిశీలించి మట్టితో పూడ్చివేయించారు. త్వరలో శాశ్వతంగా మరమ్మతులు చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

డీఎల్‌పీవో తనిఖీలు

హత్నూర: సంగారెడ్డి డీఎల్‌పీవో అనిత మంగళవారం హత్నూర మండలంలో పర్యటించారు. మధుర గ్రామంలో వైకుంఠధామం, చెత్త నిల్వ కేంద్రంతోపాటు పంచాయతీ దస్త్రాలు పరిశీలించి పారిశుద్ధ్య నిర్వహణకు సూచనలు చేశారు. హత్నూరలో ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదాస్పదమైన ఖాళీ స్థలానికి సంబంధించిన వివరాలు సేకరించారు. అనంతరం బోర్పట్ల గ్రామాన్ని సందర్శించి శివారులోని ఓ పరిశ్రమ చేపట్టిన నిర్మాణాలు కొలతలు తీశారు. పరిశ్రమలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు అధికారి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ యూసుఫ్, కార్యదర్శులు మహేష్, అనురాధ, సాయికుమార్ పాల్గొన్నారు.

నేడు రాయికోడ్‌కు మంత్రి దామోదర్

రాయికోడ్: రాయికోడ్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం, శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనడానికి బుధవారం మంత్రి దామోదర్ రాజనర్సింహ రాయికోడ్‌కు రానున్నట్లు గ్రంథాలయ కమిటీ జిల్లా ఛైర్మన్ అంజయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలాజీ నర్సింలు మంగళవారం స్థానికంగా పేర్కొన్నారు. ఈమేరకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వారు తెలిపారు.

చీరల పంపిణీ

జహీరాబాద్, న్యూస్‌టుడే: జహీరాబాద్ పట్టణంలోని ‘అన్నదాన సేవా సంస్థ’ ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలోని అనాథలు, విధి వంచితులకు మంగళవారం చీరలు పంపిణీ చేశారు. జహీరాబాద్ పట్టణంలోని వివిధ ఆలయాలు, వంతెనలు, బస్టాండు, రైల్వేస్టేషన్ల వద్ద తలదాచుకునే వారికి ఈ సంస్థ ఆధ్వర్యంలో రెండేళ్లుగా నిత్యం ఆహారం పంపిణీ చేస్తుండటం గమనార్హం. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు బెజుగం రాజయ్య, ఆర్.నారాయణరెడ్డి, సంగప్ప, శ్యామ్‌రావు పాల్గొన్నారు.

‘బతుకమ్మ’ ఏర్పాట్ల పరిశీలన

నారాయణఖేడ్: నారాయణఖేడ్ పురపాలక సంఘ పరిధిలోని 2, 3 వార్డులతోపాటు నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలోబతుకమ్మ సంబురాల నిర్వహణకు అనువైన స్థలాన్ని మంగళవారం పురపాలిక ఉప ఛైర్మన్ దారం శంకర్ ఆధ్వర్యంలో పలువురు పరిశీలించారు.

కల్హేర్, న్యూస్‌టుడే: గ్రామాల్లో బతుకమ్మ, దసరా పండగకు పకడ్బందీగా ఏర్పాటు చేయాలని కల్హేర్ ఎంపీడీఓ రమేష్‌బాబు సూచించారు. మంగళవారం కల్హేర్‌లో ఉపాధి హామీ, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువుల్లో బతుకమ్మలను వదిలేటప్పుడు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. చెరువులోకి తాత్కాలిక మెట్లు తయారు చేయించాలన్నారు. బారికేడ్లు నిర్మించాలని, విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ సూచించారు. ఎంపీవో శ్రీనివాస్, ఈసీ వేణుమాదవ్, ఏపీఓ శ్యాం, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన నేడు

కోహీర్, న్యూస్‌టుడే: బిలాల్‌పూర్ రైతు వేదికలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు బుధవారం అవగాహన కల్పిస్తామని ఏవో నవీన్‌కుమార్, ఏఈవో మౌనిక మంగళవారం తెలిపారు. పంట సాగుకు పెట్టుబడి, ప్రభుత్వం అందించే రాయితీ, ప్రోత్సాహకాల గురించి వివరిస్తామన్నారు.

శతశాతం రాయితీపై చేప పిల్లలు పంపిణీ చేయండి

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా మత్స్యశాఖ అధికారి నర్సింహారావును మత్స్యశాఖ సహకార సంఘం సభ్యులు మంగళవారం కలిశారు. 100 శాతం రాయితీపై చేప పిల్లలను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు రమేశ్, హన్మంత్, శ్రీను, లక్ష్మణ్, వెంకటేశం పాల్గొన్నారు.

ఎంపీకి ఆహ్వాన పత్రిక అందజేత

ఝరాసంగం, న్యూస్‌టుడే: బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమంలో నిర్వహించే దసరా వేడుకలకు రావాల్సిందిగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆశ్రమ పీఠాధిపతి అవధూతగిరి మహారాజ్ మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి ఆహ్వాన పత్రిక అందజేసినట్లు చెప్పారు. వేడుకలకు వచ్చేందుకు కృషి చేస్తానని తెలియజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విశ్వమాన ధర్మప్రచార సంఘం ఉపాధ్యక్షుడు నర్సింగ్‌రావు ఉన్నారు.



ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న అవధూతగిరి మహారాజ్

అమ్మ దర్శనం.. బహురూపం

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని జిల్లాలోని పలు పట్టణాలు, గ్రామాల్లోని మండపాల్లో దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఝరాసంగం కేతకిలో చాముండేశ్వరిదేవిగా, ఈదులపల్లిలో మహాలక్ష్మి అవతారంలో అమ్మ దర్శనమిచ్చారు. – న్యూస్‌టుడే బృందం.





కేతకిలో.. ఈదులపల్లిలో...



దోమడుగులో కాటా సుధారాణి తదితరులు



సదాశివపేట: కుంకుమార్చనలో మహిళలు



నవరాత్రి ఉత్సవాల్లో నిర్మలారెడ్డి..



నారాయణఖేడ్‌లో...



బోరంచలో..